సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



ఉద్యాన సాగుతో ఆర్థిక పరిపుష్టి
ఉద్యాన పంటల సాగుకు సంబంధించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలతో పాటు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. -8లో



సామాన్యులకు తక్షణ న్యాయం
పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్యుల ఫిర్యాదులకు తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. -8లో

గరిష్టం/కనిష్టం
40.2/26.6

వాతావరణం
జిల్లాలో మంగళవారం 26.6 - 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు లైట్లు ఆఫ్ చేసి నిరసన
కడప కల్చరల్: ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం రాత్రి లైట్లు ఆఫ్‌చేసి నిరసనలు తెలియజేయాలని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. రాత్రి 9 నుంచి 9.15 వరకు ఇంటిలో, దుకాణాలు, సంస్థలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో లైట్లు ఆఫ్ చేసి ప్రతి ఒక్కరూ తమ నిరసనలు తెలియజేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం
కడప కార్పొరేషన్: ఐటీఐ సివిల్, డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్, ఎంటెక్ ఇన్‌స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ చదివిన వారు లైసెన్స్ టెక్నికల్ పర్సన్, లైసెన్స్ టెక్నికల్ సర్వేయర్, లైసెన్స్ స్ట్రక్చరల్ ఇంజనీర్లు కొత్తగా లైసెన్స్ పొందుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో నివసించే ప్రజలకు స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రాలు స్వీకరించి సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసేందుకు వారి అవసరం ఉందని పేర్కొన్నారు .ఆసక్తి గలవారు కార్పొరేషన్ కార్యాలయంలో గాని, ఏపీడీపీఎంఎస్‌లోగానీ సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి స్లాట్ బుకింగ్ విధానం
కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టారు. ఈ నెల 30వ తేది నుంచి జిల్లాలోని కడప రూరల్, సిద్దవటం, బద్వేలు, మైదుకూరు, దువ్వూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, పులివెందుల, వేంపల్లె, కమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే తొలుత స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. క్రయ, విక్రయదారులు ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

కిశోరి వికాసంపై అవగాహన కల్పించాలి
కడప కోటిరెడ్డిసర్కిల్: కిశోరి వికాసం సమ్మర్ క్యాంపు ద్వారా యువతకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె ఎంపీడీఓలు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులతో ఆన్‌లైన్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం సమ్మర్ క్యాంపు ప్రతి గ్రామ, వార్డుల్లో 15-18 ఏళ్లలోపు కిశోరి బాలికలకు గ్రూపులు ఏర్పాటు చేసి ప్రతి మంగళ, శుక్ర వారాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తూ 12 అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మే 2 నుంచి జూన్ 10వ తేది వరకు ఈ సమ్మర్ క్యాంపు నిర్వహించాలన్నారు. మండల అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

ఐటీఐలలో అడ్మిషన్లు ప్రారంభం
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ ప్రక్రియ ఈ నెల 28 నుంచి ప్రారంభమయిందని ప్రభుత్వ ఐటీఐ (మైనారిటీస్) జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జ్ఞాన కుమార్ తెలిపారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్, ఇంటర్ పాసై 14 ఏళ్లు నిండిన విద్యార్థులు అర్హులని తెలిపారు. 10వ తరగతి మార్కుల ఆధారంగా మెరిట్ రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్‌కార్డు, ఫొటో, మెయిల్ ఐడీ, పర్మినెంట్‌గా ఉపయోగించే మొబైల్ నెంబర్‌తో దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ దగ్గరకు వెళ్లి iti.ap.gov.in వెబ్‌సైట్ నందు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అడ్మిషన్‌కు మే 24వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్
కడప కార్పొరేషన్: జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యుత్ శాఖ పర్యవేక్షకు ఇంజనీరు ఎస్. రమణ అన్నారు. మంగళవారం విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసే విధంగా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్ టాప్ వల్ల విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకున్న వారికి సబ్సిడీ పోను పెట్టిన పెట్టుబడి తక్కువ కాలంలోనే తిరిగి వస్తుందన్నారు. నెడ్‌క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ రమణారెడ్డి, ఎల్లారెడ్డి, ఏఈ మధుసూదన్, జూనియర్ ఇంజనీర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర..
మైనింగ్ జాతర!

అక్కడ మైనింగ్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు అవసరం లేదు.. తెలుగుదేశం నాయకుల అండ ఉంటే చాలు. అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతుంది.. అధికారులా అటు వైపు కన్నెత్తి చూడరు. చివరికి ఇతరుల ఖనిజం లూటీ చేసినా సరే, కనీస చర్యలుండవు. ఇదీ టీడీపీ నేతల తీరు... ఒక్కమాటలో చెప్పాలంటే పులివెందుల కేంద్రంగా దోపిడీరాజ్యం నడుస్తోంది.



పులివెందులలో అక్రమార్జనకు పోటీపడుతున్న టీడీపీ నేతలు
- కోట్లాది రూపాయలు బెరైటీస్ లూటీ చేసినా చర్యల్లేవ్
- కన్నెత్తి చూడని అధికారులు



వేముల కేంద్రంగా యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ మైనింగ్

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల నియోజకవర్గంలో వేముల, గొందిపల్లె, తాళ్లపల్లె, కత్తులూరు, కొత్తపల్లె ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. తెలుగుతమ్ముళ్లు అక్రమార్జన కోసం పోటీ పడుతున్నారు. గ్రావెల్, ఇసుక, బరైటీస్, క్వార్ట్జ్ ఖనిజాలకు చెందిన అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా నడుస్తోంది. వేముల కేంద్రంగా ఈతంతు మరింత అధికంగా ఉంది. టిఫెన్ బరైటీస్ సంస్థ నిల్వ చేసుకొని ఉన్న కోట్లాది రూపాయాలు విలువైన ఖనిజాన్ని టీడీపీ నేతలు ఒక్క రాత్రిలో పదుల సంఖ్యలో టిప్పర్లు పెట్టి తరలించుకుపోయారు. టీడీపీ నేత పేర్ల పార్థసారధిరెడ్డి నేతృత్వంలో బరైటీస్ ఖనిజాన్ని లూటీ చేశారని టిఫెన్ కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యల్లేవు. మరోవైపు వేంపల్లె మండలం కత్తులూరు కేంద్రంగా కొనసాగిస్తున్న అక్రమ మైనింగ్ నిర్వహణలో అమ్మయ్యగారిపల్లెకు చెందిన చిట్టిబోయిన రామచంద్ర(52) మృతి చెందారు. ట్రాక్టర్ ప్రమాదంలో చనిపోయినట్లు కేసు నమోదు చేసి, పోలీసులే మధ్యస్థం చేసి కేసు మమ అన్పించారు. ఈ వ్యవహారంలో టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సమీప బంధువు నవీన్‌రెడ్డి ఉండడంతోనే పోలీసులు వ్యవహారాన్ని కప్పి పుచ్చినట్లు సమాచారం. దీనిని బట్టి పులివెందుల ప్రాంతంలో కూటమి నేతలు.. పోలీసుల తీరును ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఇసుక అక్రమ రవాణా..



పులివెందుల నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. చక్రాయపేట మండలానికి చెందిన టీడీపీ నాయకుడు పాపాగ్ని నది నుంచి, పార్నపల్లెకు చెందిన నేత చిత్రావతి నుంచి ప్రతినిత్యం యదేచ్ఛగా ఇసుకను అక్రమంగా బెంగళూరుకు తరలిస్తున్నట్లు సమాచారం. వీరు నిత్యం పులివెందుల మీదుగానే లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నా పోలీసులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారు. దీనికి కారణం ఓ ట్రిపుల్‌స్టార్ అధికారి ప్రమేయమేనని తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణాలో పులివెందుల నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులకు కూడా వాటాలు ఉన్న కారణంగా రేయింబవళ్లు అక్రమ రవాణా కొనసాగుతోందని పలువురు వివరిస్తున్నారు. కాబట్టే చర్యలు తీసుకునేందుకు అధికారులు జంకుతున్నట్లు సమాచారం.

అసాంఘిక కార్యకలాపాలు సైతం...
పులివెందుల పట్టణ పరిధిలో అధికార పార్టీ నాయకులు, ఓ ట్రిపుల్ స్టార్ అధికారి అండదండలతో అసాంఘిక కార్యకలాపాలు సైతం జరుగుతున్నట్లు సమాచారం. అంతా తానే చూసుకుంటూ ఎవ్వరి లెక్కచేయాల్సిన అవసరం లేదంటూ ఓ అధికారి పెద్ద ఎత్తున మామాళ్లు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని నగరిగుట్టలోని బీసీ హాస్టలు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి, అలాగే మారుతి హాల్ ఏరియాలోని మరి కొంతమంది వ్యక్తులు మంగతాయి జూదం, క్రికెట్ బెట్టింగ్స్ విపరీతంగా కొనసాగిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. వేంపల్లె, వేముల, చక్రాయపేట ప్రాంతాలల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. వాటాలు ముడుతున్న కారణంగా అటు అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఇటు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహణపై పోలీసుశాఖ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెరుగైన సౌకర్యాల కల్పనకు ఆర్టీసీ కృషి

ఆర్టీసీ జోనల్‌చైర్మన్ పూల నాగరాజు



ఆర్టీసీ గ్యారేజీలో పర్యటిస్తున్న జోనల్ చైర్మన్ నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల మెరుగైన సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు చేపడుతోందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీ, ఆర్టీసీ ఆస్పత్రిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆ తర్వాత అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలోనే ప్రారంభమవుతుందని, ఈ నేపథ్యంలో తమ పరిశీలనకు వచ్చిన అంశాలను నివేదిక ద్వారా ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. త్వరలోనే ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు సైతం ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే ఉమ్మడి కడపజిల్లాకు చెందిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రితోపాటుస్థానిక ఎమ్మెల్యే మాధవిరెడ్డిని కలిసి.. ప్రయాణికులకు సంబంధించి సమస్యలను చర్చించామన్నారు.ఈ కార్యక్రమంలో ఈడీ పైడి చంద్రశేఖర్, ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, డీఎం డిల్లీశ్వరరావు, కార్గో డిప్యూటీ సీటీఎం (ఆపరేషన్స్ అండ్ కమర్షియల్) హరి, కార్గో మేనేజర్ జనార్దన్, అసిస్టెంట్ మేనేజర్లు కన్యాకుమారి, మంజుల పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలి
ఏపీఎస్ ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. మంగళవారం ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపజోన్ రాష్ట్రంలోని మిగతా జోన్‌ల కంటే అధిక డిపోలు కలిగి ఉందని.. అందరి సహకారంతోనే సంస్థ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన వివరించారు.

మే 4న లాంగ్‌మార్చ్



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మే 4వ తేదీ ఆదివారం జరిగే లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని అంజద్‌బాషా కార్యాలయంలో పార్టీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి స్మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ నాయకుడు జమాల్‌వలీ, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అల్లాబక్ష్, అల్తాఫ్, బీహెచ్ ఇలియాస్, త్యాగరాజు, వినోద్, జమీల్, బాబు, కార్పొరేటర్లు పాకా సురేష్, షఫీ, బసవరాజు, బాలస్వామిరెడ్డి, షంషీర్, చాక్లెట్ గౌస్, మల్లికార్జున, కోఆప్షన్ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఉన్నారు.

కడప పార్లమెంట్ పరిశీలకుడిగా అజయ్ రెడ్డి

- రాజంపేట పార్లమెంటు పరిశీలకుడిగా కె. సురేష్ బాబు
- తిరుపతి పార్లమెంటు పరిశీలకులుగా ఎంపీ రఘునాథ్‌రెడ్డి
- హిందూపురానికి రమేష్‌కుమార్‌రెడ్డి..



కొండూరు అజయ్‌రెడ్డి



కె.సురేష్‌బాబు



మేడా రఘునాథరెడ్డి



ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

సాక్షి రాయచోటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంతోపాటు ఎక్కడికక్కడ అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ అధిష్టానం ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలతోపాటు ఇతర అక్రమాలను నిలదీయడంలో భాగంగా.. పార్లమెంటు నియోజకవర్గాలకు పరిశీకులను నియమించింది. అందుకు సంబంధించి కడప పార్లమెంటు పరిశీలకులుగా స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత కొండూరు అజయ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్లమెంటుకు సంబంధించి పరిశీలకులుగా కడప నగర మేయర్ కె.సురేష్‌బాబును నియమించారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్య క్షులుగా పని చేసిన అనుభవంతోపాటు జెడ్పీ చైర్మన్‌గా కూడా సురేష్‌బాబు పని చేసి ఉన్నారు.

- తిరుపతి పార్లమెంటు పరిశీలకులుగా రాజంపేటకు చెందిన రాష్ట్ర నాయకులు, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డిని పార్టీ నియమించింది. తిరుపతి జిల్లాలో మేడా రఘునాథరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. అంతేకాకుండా రాయ చోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లెకు చెందిన మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని కూడా హిందూపురం నియోజకవర్గ పరిశీలకులుగా పార్టీ నియమించింది. ఎక్కడికక్కడ జిల్లాలో అందరినీ సమన్వయం చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్ఫలితాలు సాధించేలా, ప్రభుత్వంపై అలుపెరగని పోరాటాలు చేయడమే లక్ష్యంగా పరిశీలకులను నిమించారు.

అవినీతికి ఉపాధి హామీ!

- ఒకే ఫొటో ఐదారు మస్టర్లకు అప్‌లోడ్ చేస్తున్న వైనం
- కువైట్‌లో ఉన్న వారు పనికి వచ్చినట్లు మస్టర్లలో హాజరు
- పనికి రాకున్నా ఖాతాల్లోకి నగదు
- లక్షల్లో స్వాహా చేస్తున్న ఉపాధి సిబ్బంది



కుప్పం గ్రామంలో వర్క్ ఐడీ 83048కి అలాగే 885కు అప్‌లోడ్ చేసిన ఒకే ఫొటో

చక్రాయపేట: ఉపాధి హామీ పథకం పక్కదారి పట్టింది. సిబ్బంది చేతివాటానికి లెక్కాపత్రం లేకుండా పోయింది. నిబంధనలకు పాతరేస్తూ అధికారుల దోపిడీ పర్వం దర్జాగా సాగుతోంది. అడ్డగోలుగా మస్టర్లు రాస్తూ.. ఒకే ఫొటోను పలు ఐడీలకు అప్లోడ్ చేస్తూ లక్షల్లో నిధులు స్వాహా చేస్తున్నారు. ఉన్నతాధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం గమనార్హం.

ఒకే ఫొటో ఐదారు మస్టర్లకు..
సాధారణంగా ఉదయాన్నే కూలీలు పనిలోకి రాగానే వారు పని చేస్తున్న వర్క్‌ఐడీకి సంబంధించి అధికారులు ఇచ్చిన మస్టరులో హాజరు వేయాలి. ఆ మస్టరుకు సంబంధించిన కూలీల గ్రూపు ఫొటో ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడ హాజరు ఎలా ఉందో పనులు ఎవరు చేస్తారో తెలియదు కాని కూలీల గ్రూప్ ఫొటో మాత్రం ఐదారు మస్టర్లకు ఒకటే అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికితోడు చిన్నపిల్లలను కూడా ఉపాధి పనులకు వచ్చినట్లు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తుండడం గమనార్హం.

వారానికి లక్ష...
పనులకు రాని వారిని.. విదేశాల్లో ఉన్న వారిని సైతం పనికి వస్తున్నారని హాజరువేస్తూ ఆ డబ్బు మింగేస్తున్నారు. ఒక మస్టరులో 10 మంది కూలీలు ఉంటే వారానికి రు.16వేలు డబ్బు పడుతుంది. ఒక్కో మస్టరులో ఐదారుమందే పని చేస్తుంటారు. ఫొటోలు మాత్రం పది మంది చేస్తున్నట్లు అప్లోడ్ చేస్తున్నారు. దీంతో వివిధ మస్టర్లకు సంబంధించి వారానికి సుమారు 80నుంచి 90 వేలు వరకు సిబ్బంది జేబుల్లోకి వెళుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక మస్టరు పైనే నెలకు రు.3లక్షల పైనే నొక్కేస్తుంటే ఇలాంటి మస్టర్లు గ్రామానికి ఎన్ని ఉంటాయో సదరు సిబ్బందికే ఎరుక.

ఉత్తుత్తిగా సామాజిక తనిఖీ
ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలను వెలికి తీస్తారని లక్షలు ఖర్చు పెట్టి ప్రభుత్వం సామాజిక తనిఖీ బృందాలను పంపుతోంది. సదరు సామాజిక తనిఖీ బృందాలు విచారణ తూతూ మంత్రంగా చేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనికి పరిహారంగా వీరికి లక్షలు ముట్టజెబుతున్నట్లు అర్థమవుతోందని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



ఒక్క కుప్పం గ్రామ పంచాయతీలోనే..
నాలుగైదు రోజులుగా చూస్తే కుప్పం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న దినసరి కూలీల సంఖ్య వందల్లో ఉంటోంది. ఫొటోలు చూస్తే ఒకే గ్రూప్ ఫొటో ఐదారు మస్టర్లకు అప్‌లోడ్ చేస్తున్నారు.తిరిగి వారిలోంచే కొందరిని విడదీసి మరో ఫొటో తీసి మరి కొన్ని మస్టర్లకు అప్‌లోడ్ చేస్తున్నారు. ఈనెల 18వ తేదీన వర్క్ ఐడీ నెంబరు 83048 కు సంబంధించి అధికారులు కూలీల హాజరుకు గాను మస్టర్లు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చారు. 884, 885, 886, 890, 891, 893 ఈమస్టర్లు ఆరు గ్రూపులు ఒకే వర్క్ ఐడీలో పని చేస్తున్న కూలీలకు సంబంధించినవి. ఒక్కొక్క మస్టరుకు ఒక్కో గ్రూపుకు సంబంధించిన కూలీల గ్రూపు ఫొటో మాత్రమే అప్‌లోడ్ చేయాలి. కాని ఇక్కడ పై ఆరు మస్టర్లను పరిశీలిస్తే ఒక గ్రూపునకు చెందిన కూలీలే అన్ని మస్టర్లకు సంబంధించి గ్రూప్ ఫొటో అప్‌లోడ్ చేశారు. ఈ తంతు ప్రతి రోజు జరుగుతోంది. ఒక కూలీకి రోజుకు సుమారు మూడొందలు తక్కువ కాకుండా లెక్క పడేలా చేసి డబ్బు పడగానే వాటిని డ్రా చేయించుకొని పంచుకుంటుకుంటున్నారు. ఇందులో కొంత మొత్తం సాంకేతిక సహాయకులు తీసుకొంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరికైతే పాత గుంతలు జిగిరి వెళ్లండి మీకు మూడొందలు కూలి పడేలా చేస్తామని చెప్పి.. రెండొందల చొప్పున కూలీల నుంచి లాగేసు కుంటున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే నెరుసుపల్లె పంచాయతీలో చిన్న పిల్లల ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు.ఇదే పంచాయతీలో చంద్రకళ అనే మహిళ గల్ఫ్ దేశాలకు వెళ్లింది.అయితే ఆమె రోజూ పనులకు వస్తున్నట్లు హాజరు వేస్తున్నారు. ఇక్కడ పాత గుంతలను జిగిరించి కొత్తవిగ చూపుతున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: ఏపీఓ షబ్బీర్
ఉపాధి హామీలో అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే అలాంటి వారిపై విచారణ జరిపి తగు చర్యల నిమిత్తం ఉన్నతాది కారులకు నివేదిక పంపుతామని ఏపీవో షబ్బీర్ తెలిపారు. ఐదారు మస్టర్లకు ఒకే ఫొటో అప్‌లోడ్ చేస్తున్నారనే విషయంపై అడగ్గా.. తాను కొత్తగా వచ్చానని,మీటింగ్ పెట్టుకొని మందలించి ఇకపై అలా జరుగకుండా చూస్తామని జవాబిచ్చారు.

నేడు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

- జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 8258 మంది విద్యార్థులు
- ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం



కడప పరీక్షా కేంద్రంలో పాలిసెట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాలిసెట్ కో-ఆర్డినేటర్

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించనున్న పాలిసెట్ -2024 ప్రవేశ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కడపలో 10, ప్రొద్దుటూరులో 4 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ 14 పరీక్షా కేంద్రాలలో మొత్తం 8258 మంది విద్యార్థులు పరీక్షను రాయనున్నారు. ఇందులో కడపలోని 10 పరీక్షా కేంద్రాలలో 3943 మంది విద్యార్థులు, ప్రొద్దుటూరులోని 4 కేంద్రాలలో 4315 మంది విద్యార్థులు ఈ పరీక్షను రాయనున్నారు. కాగా, అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

నిమిషం ఆలస్యమైనా..



పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులంతా గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. పరీక్ష ప్రారంభమైన తరువాత ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించం. - సిహెచ్. జ్యోతి, జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్, కడప

క్లుప్తంగా

కేబుల్ వైర్ల దొంగలను పట్టుకున్న రైతులు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామ రైతుల పొలాల వద్ద సోమవారం రాత్రి కేబుల్ వైర్లు దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇటీవల తోటల దగ్గర ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కేబుల్ వైర్లు అపహరించి, వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చాలామంది యువకులే కేబుల్ వైర్లను అపహరిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జల్సాలకు అలవాటుపడిన యువకులు రాత్రి సమయాల్లో మద్యం సేవిస్తూ తోటల దగ్గరికి వెళ్లి కేబుల్ వైర్లు అపహరిస్తున్నారని అంటున్నారు. లక్షలాది రూపాయల విలువైన మోటారు వైర్లు చోరీకి గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. పట్టుబడిన దొంగలను పోలీసులకు అప్పగించారు.

మట్కా నిర్వాహకులు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంజీవయ్య నగర్‌లో మట్కా జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో సీఐ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. దాడిలో వాజ్‌పేయ్‌నగర్‌కు చెందిన కాకి కుళ్లాయప్ప, సంజీవయ్య నగర్‌కు చెందిన బండారు లక్ష్మీనారాయణ, బండారు శ్రీనాథ్, అంకట రాముడులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 26,500 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడిలో ఎస్ఐ ధనుంజయ, సిబ్బంది పాల్గొన్నారు.

మేడే రోజున రెట్టింపు వేతనం ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే రోజున పని చేసే కార్మికులకు రెట్టింపు వేతనం ఇవ్వాలని ఉప కార్మిక కమిషనర్ బి.శ్రీకాంత్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు మేడేను కార్మికుల సెలవు దినంగా ప్రకటించారన్నారు. ఒకవేళ దుకాణాలు, సంస్థ యాజమాన్యాలు కార్మికులతో వారి ఇష్టపూర్వకంగా పని చేయించుకుంటే దానికి బదులుగా ఒకరోజు సెలవు దినాన్ని 30 రోజుల్లో ఇవ్వాలని, ఆరోజు పనిచేసిన వారికి రెట్టింపు వేతనం ఇవ్వాల్సిందిగా ఆదేశించామని తెలిపారు.

ఎంప్లాయ్‌మెంట్ రిటర్న్స్ సమర్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం కడపకు సంబంధించిన పబ్లిక్, ప్రైవేటు ఎస్టాబ్లిష్‌మెంట్ ఎంప్లాయ్‌మెంట్ రిటర్న్స్ కోసం ఆన్‌లైన్ ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి (మార్చి, జూన్, సెప్టెంబరు, డిసెంబరు) పంపాలని కోరినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎంప్లాయ్‌మెంట్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఎంప్లాయర్ లాగిన్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ రిటర్న్స్‌ను సమర్పించాలని కోరారు. ఏవైనా సందేహాలుంటే 8179365417 నంబరులో సంప్రదించాలన్నారు.

బాలికపై అత్యాచారం

– పోక్సో కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో సప్లయర్ షాపు యజమానిపై రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన మైనర్ బాలిక ఓ హోటల్‌లో పని చేస్తోంది. మైదుకూరు రోడ్డులోని సప్లయర్ షాపు యజమాని సుధాకర్‌శర్మ తరచూ హోటల్‌కు టిఫిన్ చేయడానికి వెళ్తూ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి బాలికను పలుమార్లు బయటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో తనకు కడుపు నొప్పిగా ఉందని చెప్పడంతో బాలికను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేయగా బాలిక గర్భం దాల్చినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సుధాకర్‌శర్మపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


ఆశీర్వాదం మృతదేహం

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లె గ్రామానికి చెందిన ఆశీర్వాదం(19) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు సురేష్ తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యువకుడు ఆశీర్వాదం గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ ఉండేవాడు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యాన సాగుతో ఆర్థిక పరిపుష్టి

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప అగ్రికల్చర్/చింతకొమ్మదిన్నె : ఉద్యాన పంటల సాగుకు సంబంధించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలతో పాటు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఏపీ జీఎస్‌డీపీలో జిల్లా వాటా శాతాన్ని పెంపొందించేందుకు ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందని దీంతోపాటు వైఎస్సార్ జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. జిల్లా రైతులకు ఉద్యాన సాగులో ప్రోత్సాహం కల్పించే దిశగా మంగళవారం కడప నగర శివార్లలోని మాధవి కన్వెన్షనల్ హాల్‌లో జిల్లా ఉద్యాన శాఖ జిల్లా అధికారి సుభాషిణి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ×కడప ఉద్యాన సమ్మేళనం్ణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా జీవీఏలో 45 శాతం వాటా ఒక్క ఉద్యాన ఉత్పత్తుల ద్వారా వస్తోందన్నారు. జిల్లాలో ప్రధానంగా అరటి, చీనీ, పసుపు, ఉల్లిగడ్డ మొదలైన ప్రధాన పంటలను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజన్స్‌గా గుర్తించామన్నారు. ఈ ప్రధాన పంటలను రాష్ట్ర, దేశ స్థాయితో పాటు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్ర హార్టికల్చర్- సెరికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తూనే ఉద్యాన పంటలను సాగుచేసే రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి మారాలన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు అపారమైన అవకాశాలు, సదుపాయాలు ఉన్నాయని, అందుకు సంబంధించిన ఉత్పత్తుల నిల్వకు అవసరమైన శీతల గిడ్డంగుల నిర్మాణం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడంలో ఉద్యా శాఖ పాత్ర ఎంతో కీలకం అని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన రంగంలో కొన్ని సవాళ్లు ఉన్నాయన్నారు. పోస్ట్ హార్వెస్ట్‌లో ఆ నష్టాలు 10- 15 శాతం ఉన్నాయని, ఆ నష్టాలను ఎంత తగ్గించగలిగితే రైతులకు అంత ఆదాయం పెంచగలుగుతామన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ సమ్మేళనాన్ని నిర్వహించాలని కోరారు. తిరుపతి నిమ్మ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ డాక్టర్ జి. శేఖర్‌బాబు, అనంతరాజుపేట డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల హెచ్ఓడీ - ప్రొఫెసర్లు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ రాజానాయక్ మాట్లాడారు. అనంతరం సహజ పద్ధతుల్లో పసుపు సాగు చేస్తున్న చెన్నూరుకు చెందిన ఆదర్శ రైతు కె. బాలచంద్ర, బహుళ పంటలు సాగు చేస్తున్న కామనూరుకు చెందిన ఆదర్శ రైతు ఎస్. రాఘవరెడ్డిలను ముఖ్య అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అయితా నాగేశ్వర రావు, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శారదమ్మ, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, హార్టికల్చర్ టెక్నికల్ అధికారి జ్యోతిర్మయి, మార్కెటింగ్, ఉద్యాన, సంబంధిత అధికారులు, రైతులు, శాస్త్రవేత్తలు, ఉద్యాన కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో మే 4న నీట్ యూజీ-2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్ హాలులో నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నీట్ యూజీ అధికారులు, విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రొద్దుటూరులో రెండు పరీక్ష కేంద్రాలు, కడప జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 2428 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్ లైన్ విధానంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, కడప కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ నీట్ సిటీ కోఆర్డినేటర్ మునిష్ మీనా, నీట్ ప్రొద్దుటూరు సిటీ కోఆర్డినేటర్ గంగయ్య, నీట్ యూజీ నోడల్ అధికారులు, ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కడప మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా కడప మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టారని చీఫ్ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. మే 8, 15, 22, 29 తేదీలలో హైదరాబాదు చర్లపల్లిలో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు చేరుతుందన్నారు. 9, 16, 23, 30 తేదీలలో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4.30 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు. మరొక రైలు (07253) మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17, 24 తేదీలలో ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు కాజీపేటలో బయలుదేరి ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు ప్రతి బుధవారం (07254) మే 7, 14, 21, 28, జూన్ 4, 11, 18, 25 తేదీలలో మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.00 గంటలకు కాజీపేట చేరుతుందన్నారు.

మహిళ నేత్రదానం


కార్నియాలను సేకరిస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ సభ్యులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణం కచేరి రోడ్డులో నివాసముంటున్న కొడుమూరు లక్ష్మీదేవి మంగళవారం మరణించడంతో అంధుల ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్, రమాదేవి, వెంకటేష్, వెంకటమ్మ, గంగమ్మలు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీశ్ సభ్యులతో కలిసి అంధుల ఆశ్రమానికి వెళ్లి లక్ష్మీదేవి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపించారు. ఈ సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సభ్యులు అంధుల ఆశ్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరువురు రైల్వే హెడ్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్?

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిజామాబాద్-తిరుపతి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం రాత్రి గుత్తి వద్ద దుండగులు పలు బోగీల్లో చొరబడి బంగారు నగలు, విలువైన వస్తువులు అపహరించిన సంఘటనపై ఇరువురు రైల్వే హెడ్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం. కడప రైల్వేస్టేషన్ పరిధిలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు ప్రకాశ్, వేణుగోపాల్‌రెడ్డిలు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అయితే అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

అంగరంగ వైభవం..

చెన్న కేశవుని చందనోత్సవం


నెమలి వాహనంపై కొలువు దీరిన వైద్య నాథ స్వామి పూజల్లో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి


చందనోత్సవ అలంకార భూషితుడైన చెన్నకేశవ స్వామి

వల్లూరు : పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో శ్రీ చెన్న కేశవ స్వామి మూల విరాట్‌కు చందనోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. చందన భూషితుడై తేజోవంతంగా కనిపిస్తూ చల్లని దీవెనలందిస్తున్న స్వామిని దర్శించుకుని భక్తులు తరించారు.

పుష్పగిరి గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్యనాథేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవి అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. రాత్రి పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి ఆధ్వర్యంలో నెమలి వాహనంపై కొలువు దీరిన శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో స్వామివారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెన్న కేశవ స్వామి హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు.

పుష్పగిరిలో నేడు అక్షయ తదియ ఉత్సవాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అతి ముఖ్యమైన అక్షయ తదియ తిరునాల ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. ఉదయం చెన్న కేశవునికి పూలంగి సేవ జరుగుతుంది. రాత్రి జరిగే వైద్యనాథుడి నందివాహన సేవకు, శ్రీ చెన్న కేశవుని గరుడ వాహన సేవకు విశేష సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

మృతదేహం లభ్యం


గుర్తు పట్టలేని విధంగా దేవేంద్ర మృతదేహం

అట్లూరు : మండల పరిధిలోని మాడపూరు పంచాయతీ సూరాయపల్లె గ్రామ సమీపంలో ఉప్పు వాగు ప్రాంతంలో యువకుడి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు గోపవరం మండలం ఎస్.రామాపురం దళితవాడకు చెందిన నాగదాసరి దేవేంద్ర (35) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ అక్కడికి చేరుకున్నారన్నారు. మృతదేహాన్ని చూసి నాగదాసరి దేవేంద్రగా వారు గుర్తించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్.రామాపురం దళితవాడకు చెందిన వెంకటమ్మ, తిరుపాలుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా కుమారుడు దేవేంద్ర మతి స్థిమితం లేక ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడన్నారు. ఆ తర్వాత శవమై కనిపించాడని తెలిపారు.

సేవా తత్పరుడు.. జింకా సుబ్బరాయుడు

- విద్యార్థుల ఉన్నతికి ఆర్థిక చేయూత అందించడమే ఆయన లక్ష్యం
- పలు కళాశాలకు రూ. 50 లక్షల వస్తువుల వితరణ
- నేడు ఉద్యోగ విరమణ


జింకా సుబ్బరాయుడు, జ్యోతి దంపతులు





కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు వితరణగా ఇచ్చిన ఆర్‌ఓ మినరల్ ప్లాంట్, మినరల్ వాటర్ మిషన్

కడప ఎడ్యుకేషన్ : ఆయన ప్రభుత్వం నుంచి తనకు లభించే జీతాన్ని తన అవసరాల మేరకు వినియోగించుకుని మిగిలిన మొత్తాన్ని విద్యార్థుల విద్యాభివృద్ధికి వినియోగిస్తూ వచ్చారు. ఆయన పనిచేసిన కళాశాలకే కాకుండా ఇతర కళాశాలలకు చెందిన పిల్లల విద్యాభివృద్ధికి అవసరమైన పలు రకాల వస్తువులను వితరణగా ఇచ్చి దాతృత్వానికి చిరునామాగా నిలిచారు. ఇలా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు దాదాపు రూ. 50 లక్షల మేర సాయం అందించారు. ఆయనే ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్ జింకా సుబ్బరాయుడు. నేడు ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన దాతృత్వాన్ని తెలిపే కథనం..

ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన జింకా సుబ్బరాయుడు 1992లో నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఈసీఈ) లెక్చరర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. నంద్యాల కళాశాల పిల్లల చదువుకోసం పలు మార్లు దాదాపు రూ. 25 లక్షలు విలువ చేసే పలు రకాల వస్తువులను వితరణగా ఇచ్చారు. అలాగే ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 1.5 లక్షల విలువతో పలు రకాల వస్తువులు ఇచ్చారు. జమ్మలమడుగు పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 2 లక్షలు, తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 2 లక్షలు, కమలాపురం పాలిటెక్నిక్ కళాశాలకు రూ.1.24 లక్షలు, కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 3 లక్షలు, ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 3 లక్షలు, పెనుగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 3 లక్షలు, ఓబులవారిపల్లి పాలిటెక్నిక్ కళాశాలకు రూ.లక్ష, కర్నూలు ప్రభుత్వ కళాశాలకు రూ. 4 లక్షల మేర ఆర్థిక చేయూతను వస్తువుల రూపంలో అందించారు.

కడప ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు కూడా...

కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (హెచ్ఓడీ)గా పని చేస్తున్న దామోదరానికి జింకా సుబ్బరాయుడు గురువు. దీంతో తమ కళాశాలకు కూడా ఏదైనా సాయం చేయాలని హెచ్ఓడీతో పాటు ప్రిన్సిపల్ జ్యోతి అడగటంతో దాదాపు రూ. 6.50 లక్షలు విలువ చేసే పలు రకాల వస్తువులను వితరణగా ఇచ్చారు. ఇందులో రూ. 2 లక్షలు విలువ చేసే ఆర్ఓ ప్లాంట్, రెండు వాటర్ కూలర్లు, బాలికల హాస్టల్‌కు రూ. 1.22 లక్షలు విలువ చేసే వీధిలైట్లు, ఇన్వేటర్‌ను, రూ. 2.60 లక్షలు విలువ చేసే ల్యాబ్ ఎక్విప్‌మెంట్, అలాగే ప్రింటర్, ల్యాబ్‌లకు సేఫ్టీ డోర్స్ ఇలా అన్ని కలిపి దాదాపు రూ.6.5 లక్షలు విలువ చేసే పలు రకాల వస్తువులను వితరణగా ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు.

ప్రస్తుతం ఆదోని కళాశాలలో ..

జింకా సుబ్బరాయుడు ప్రస్తుతం ఆదోని పాలిటెక్నిక్ కళాశాలలో పని చేస్తున్నారు. ఈయన ఈ కళాశాలకు కూడా రూ. 10 లక్షల విలువ చేసే విద్యాభివృద్ధికి సంబంధించిన వస్తువులను వితరణగా ఇచ్చారు. ఇవే కాకుండా శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో అన్నదానం కోసం రూ. 8 లక్షలు, ఓంకారం ఆలయానికి రూ. 1.25 లక్షలను వితరణగా ఇచ్చారు.

300 మందికి చదువులు..

జింకా సుబ్బరాయుడు సతీమణి జింకా జ్యోతి కూడా ఉపాధ్యాయురాలు. ఈమె కూడా పేద పిల్లల చదువుకు తన వంతు సాయం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 300 మంది విద్యార్థులను చదివించారు.

నేడు ఉద్యోగ విరమణ..

ఆదోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ లెక్చరర్‌గా పనిచేస్తున్న జింకా సుబ్బరాయుడు బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను మీరు పనిచేసిన కళాశాలలకు ఇన్ని లక్షలు ఎందుకు ఖర్చు చేశారని ప్రశ్నిస్తే డిపార్టుమెంట్ నాకు ఎంతో ఇచ్చింది.. నేను పనిచేసే కళాశాల పిల్లలకు ఎంతో కొంత ఇవ్వాలనే దృక్పథంతోనే నా వంతు సాయాన్ని చేస్తూ వచ్చాను. నేను చేసిన ఆ సహాయం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది అంటూ సమాధానమిచ్చారు.

సామాన్యులకు తక్షణ న్యాయం


నేర సమీక్షలో పాల్గొన్న పోలీసు సిబ్బంది, మాట్లాడుతున్న ఎస్పీ

కడప అర్బన్ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్యుల ఫిర్యాదులకు తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలైన క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో పర్యాటకులు సందర్శించే నదులు, చెరువులు, వంకలు, ఇతర నీరు నిల్వ ఉండే కుంటల వద్ద సరదాగా నీటిలో దిగి ప్రమాదాల బారిన పడకుండా ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులతో పాటు గస్తీని పెంచాలన్నారు. జిల్లాలో రాత్రి 10:30 గంటల కల్లా షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కడప నగరం రింగ్ రోడ్డు, ఊటుకూరు సర్కిల్, సాక్షి సర్కిల్, ఇతర శివారు ప్రాంతాలు, ప్రొద్దుటూరు పట్టణ శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి నేరాలకు తావు లేకుండా నిరంతరం విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. జిల్లాను గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రహితంగా చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరితగతిన ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని, గతంలో ప్రమాదాలు జరిగిన బ్లాక్ స్పాట్స్, హాట్ స్పాట్స్‌ను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సి.సి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పూర్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ఎస్. మూర్తి చట్టాలపై పోలీస్ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



పోలీసులకు ప్రశంసా పత్రాలు..

విధుల్లో ప్రతిభ కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు

- ఎస్.లింగప్ప, సి.ఐ, జమ్మలమడుగు అర్బన్
- ఎస్.కె చాంద్ బాషా, సి.ఐ, పులివెందుల అర్బన్
- ఎస్.శ్రీనివాసులు, ఎస్.ఐ, ప్రొద్దుటూరు వన్ టౌన్ పి.ఎస్
- పి.మొయినుద్దీన్, ఎస్.ఐ, ముద్దనూరు పి.ఎస్
- కె.రఘురామి రెడ్డి పి.సి 2117, ప్రొద్దుటూరు వన్ టౌన్ పి.ఎస్
- ఎస్.రాఘవ రెడ్డి, పి.సి 706, చాపాడు పి.ఎస్
- వి.వేణుగోపాల్ రెడ్డి, హెచ్.సి 253, వేముల పి.ఎస్
- ఎస్.నూరు సాహెబ్, హెచ్.సి 1179, లింగాల పి.ఎస్
- బి.ఎల్లా రెడ్డి, పి.సి 3042, పులివెందుల పి.ఎస్
- కె.రామ్ రమేష్, పి.సి 3255, పులివెందుల పి.ఎస్
- ఎస్.డి. రియాజ్, పి.సి 2906, జమ్మలమడుగు పి.ఎస్
- కె.దేవదాసు, హెచ్.సి 1987, జమ్మలమడుగు పి.ఎస్
- పి.నాగేంద్ర పి.సి 858, జమ్మలమడుగు పి.ఎస్
- ఎస్.కె బాషా, పి.సి 2118, సి.సి.ఎస్, కడప
- పి.సుదర్శన్ రెడ్డి పి.సి 2838 , సి.సి.ఎస్, కడప
- సి.రమేష్, హెచ్.సి 105, ముద్దనూరు పి.ఎస్
- ఎస్.గురుమోహన్, పి.సి 3455, ముద్దనూరు పి.ఎస్





పాడి గేదెలను తీసుకెళుతున్న వ్యక్తిపై దాడి


గాయపడిన చంద్రమోహన్‌రెడ్డి

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం పాలగిరి చంద్రమోహన్ రెడ్డి అనే వ్యక్తిపై పాలెంపల్లె ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పాడి గేదెలు మేపుకుని వాటిని శుభ్రం చేసుకునేందుకు కుందూనది ఏటికి వెళుతుండగా మద్యం మత్తులో ఉన్న పాలెంపల్లె ప్రభాకర్‌రెడ్డి కట్టెతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చాపాడు పోలీసులు తెలిపారు.